క్లుప్తంగా

పైనాపిల్ కాలనీలో వైద్య శిబిరం



మహిళకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీలో ఆదివారం శ్రీసత్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, బీపీ తదితర పరీక్షలు చేశారు. సాధారణ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, కామాక్షినగర్ ప్రాంతాలకు చెందిన సుమారు 65 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కె.సుబ్బారావు, డేవిడ్, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనకమ్మ అమ్మవారి జాతర రేపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలోని కనకమ్మ అమ్మవారి జాతర చాటింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. గ్రామ సేవా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పండగ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు పాత, కొత్త వెంకోజీపాలెం గ్రామాలను విద్యుద్దీపాలంకరణ చేశారు. సోమవారం తొలేళ్ల పండగ, మంగళవారం ప్రధానం జాతర నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

బీచ్ రోడ్డు: దేశానికి శాస్త్ర సాంకేతిక విప్లవాన్ని అందించిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోడాదాసి సుధాకర్ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆనాడే రాజీవ్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గోవిందరాజులు, వజ్రపత్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి ఆశ్రయం



ఏపీ టూరిస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద వృద్ధుడితో పోలీసులు

అల్లిపురం: ఆర్కేబీచ్ కాళీమాత దేవాలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై 71 ఏళ్ల నాగరాజు ఒంటరిగా ఉండడాన్ని టూటౌన్ ట్రాఫిక్ హోంగార్డు ఉదయ శంకర్, ఆర్కేబీచ్ టూరిస్ట్ కానిస్టేబుల్ బి.శివ శంకర్‌లు గమనించి కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. కంట్రోల్ రూం సీఐ వి.గోపినాథ్ సూచనల మేరకు ఏయూటీడీ నిరాశ్రయ వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయికి తెలియజేశారు. దీంతో ఆమె స్పందించి ఆర్కే బీచ్, కాళీమాత గుడి ఎదురుగా గల ఔట్ పోస్టు వద్ద వృద్ధుడ్ని భీమ్‌నగర్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. వృద్ధుడు ఊరు, పేరు, అడ్రస్ చెప్పలేకపోతున్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు వసతి గృహం మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

కారు డోర్‌ను ఢీకొని ఆటో బోల్తా

ఆరిలోవ: జాతీయ రహదారిపై ఓ ఆటో బోల్తా పడింది. ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం మధురవాడ నుంచి నగరానికి వెళ్తున్న కారు జాతీయ రహదారిపై కంబాలకొండ ఎదురుగా పక్కన నిలిచింది. దాని నుంచి ఓ వ్యక్తి డోర్ తీసి బయటకు వచ్చే సమయంలో వెనక నుంచి వెళ్తున్న ఓ ఆటో డోర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులను పోలీసులు అంబులెన్స్‌లో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. కారు డోరు భాగం, ఆటో వెనక భాగం పాడయ్యాయి.

మెరుస్తున్న రహదారులు



ఆధునీకీకరించిన కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి వెళ్లే మార్గం



ఇంజినీరింగ్ హాస్టల్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణం

- మురుస్తున్న విద్యార్థులు
- ఏయూలో పూర్తి స్థాయిలో అంతర్గత మార్గాల ఆధునికీకరణ



మమత హాస్టల్‌కు వెళ్లే రహదారి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంతర్గత రహదారులు అద్దంలా మెరిసిపోతున్నాయి. కొద్ది రోజులుగా వర్సిటీలోని మార్గాల ఆధునికీకరణ పనులు విస్తృతంగా సాగుతున్నాయి. దీంతో పూర్తి స్థాయిలో రూపురేఖలు మార్చుకుని సుందరంగా దర్శనమిస్తున్నాయి. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా హాస్టల్ నుంచి కెమికల్ ఇంజినీరింగ్ విభాగం మీదుగా ప్రిన్సిపాల్ కార్యాలయం వరకు రహదారిని అభివృద్ధి చేశారు. రూరల్ ఎస్పీ కార్యాలయం నుంచి సివిల్ ఇంజినీరింగ్ కార్యాలయం వరకు ఆధునికీకరించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం చుట్టూ వలయాకార రహదారి, నూతనంగా నిర్మించిన ఐవోటీ కేంద్రం, ఏయూ ఇంజినీరింగ్ బ్లాక్ 1, 2, 3కి వెళ్లే రహదారులను బాగు చేశారు. మెటా హాస్టల్ నుంచి అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ సముదాయం వరకు, ఇంజినీరింగ్ విద్యార్థుల వసతిగృహాలకు వెళ్లే మార్గాలను కూడా తారు వేసి సుందరంగా తీర్చిదిద్దారు.

- ఏయూ గ్రంథాలయం వెనక భాగంలో స్నాతకోత్సవ మందిరం నుంచి వృక్షశాస్త్ర విభాగం మీదుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వరకు అంతర్గతంగా రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. వర్సిటీ సిబ్ నుంచి భౌతికశాస్త్ర విభాగం వెళ్లే మార్గంతో పాటు భౌతికశాస్త్ర విభాగం లోపల అంతర్గతంగా రహదారులను నూతనంగా నిర్మిస్తున్నారు.
- దీర్ఘకాలంగా మరమ్మతులకు నోచుకోక దెబ్బతిన్న రహదారులను ఏయూ పాలకులు పూర్తిస్థాయిలో ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం వర్సిటీలో అంతర్గత రహదారులను దాదాపు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నారు. నాణ్యతతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్టు యూనివర్సిటీ చీఫ్ ఇంజినీరింగ్ జి.శంకరరావు తెలిపారు.

రోడ్ల అభివృద్ధితో కొత్త శోభ



విశ్వవిద్యాలయం రహదారులను ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా చేస్తున్న అభివృద్ధి ఎంతో సంతోషాన్నిస్తోంది. రహదారుల ఆధునికీకరణతో ఏయూకు కొత్త శోభ సంతరించుకుంది. నూతనంగా నిర్మిస్తున్న భవనాలు, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, సీమెన్స్ సెంటర్, ఆ హబ్, ఈ క్లాస్ రూమ్‌లు వంటివి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి.

– విష్ణు వర్ధన్, బి.టెక్ ప్రథమ సంవత్సరం, ఏయూసీఈ

చిన్నారుల 'అంబలి ప్రాజెక్టు'



ముడసర్లోవ వద్ద వాకర్స్‌కు గ్లాసులో అంబలి విక్రయిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: నలుగురు పాఠశాల విద్యార్థులు. ఉదయం నడక కోసం వెళ్లే వాకర్స్‌కు ఫుట్‌పాత్‌పై అంబలి విక్రయిస్తున్నారు. ఇదేమిటి పిల్లలతో వ్యాపారం చేయిస్తున్నారా? లేదా పూట గడవక ఇలా చేస్తున్నారా? అని అందరూ భావించి చర్చించుకున్నారు. అయితే ఆ చిన్నారులను ఆరా తీస్తే అసలు విషయం తెలిసింది. ఆరిలోవ ప్రాంతానికి చెందిన నలుగురు విద్యార్థుల్లో ఇద్దరు ఎంవీపీ కాలనీలోని ఓ పాఠశాలలో 9వ తరగతి, మరో ఇద్దరు సీతమ్మధారలోని ఓ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ ప్రాజెక్టు వర్క్స్ అప్పగించారు. దీంతో ఆ నలుగురు విద్యార్థులు 'వ్యాపారం చేసి సంపాదన చేయడం' అనే అంశంపై ప్రాజెక్టు ఎంచుకున్నారు. ఇందులో భాగంగా ఆ విద్యార్థులు ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చే అంబలి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఇంట్లో అంబలి (రాగి మాల్ట్), పెసలు మొలకలు, గ్రీన్ టీ తయారు చేసి ప్లాస్కుల్లో వేసి ముడసర్లోవ వాకింగ్ జోన్‌లో రెండు రోజులుగా విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వాకర్స్ ఆ చిన్నారులను అభినందించారు. అంబలి, గ్రీన్ టీ, పెసలు మొలకలు తయారు కావడానికి ఏయే పదార్థాలు అవసరం, వాటిని ఎక్కడ సేకరించాలి, ఎలా తయారు చేయాలి, ఎంతకు విక్రయిస్తే లాభం వస్తుంది, నష్టం వస్తే ఏం చేయాలి తదితర అంశాలు తెలుసుకుని ప్రాజెక్టులో వివరాలు రాసి పాఠశాలలో అప్పగిస్తామని ఆ విద్యార్థులు తెలిపారు.

నేడు ఎంవీపీలో సదస్సు

మద్దిలపాలెం : ప్రజా ప్రయోజిత కార్యక్రమాలకు సంబంధించి అన్ని వివరాలను అవగాహన కల్పించడానికి సోమవారం ఎంవీపీ కాలనీలోని భద్రం పార్కులో సదస్సు నిర్వహించనున్నామని సీపీఎం జోన్ 3 కార్యదర్శి కుమర మంగళం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత జడ్జి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.వల్లభనాయుడు, పబ్లిక్ యుటిలిటి సర్వీసెస్ న్యాయ సేవలపై అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సదస్సుకు హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రావ్యంగా కచేరీ

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అమెరికాకు చెందిన అమృత వర్షిణి అచ్చల వీణావాదన కచేరీ శ్రావ్యంగా సాగింది. వీఎంఏ ఉపాధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, నాదాలయ నిర్వాహకుడు వంకాల వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి, కచేరీని ప్రారంభించారు. అమృత వర్షిణి వీణా కచేరీకి మృదంగంపై సరస్వతుల హనుమంతరావు సహకరించారు.

అద్దెకు దిగిన ఇల్లు తనదంటూ దౌర్జన్యం

పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు

సింథియా: వృద్ధాప్యంలో తోడుగా ఉంటానని మాయమాటలు చెప్పి రెండేళ్ల కిందట అద్దెకు దిగిన ఓ యువకుడు.. ప్రస్తుతం ఆ ఇల్లు తనకే చెందుతుందని ఎదురు తిరగడంతో సదరు ఇంటి యజమాని మల్కాపురం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా.. జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో దువ్వాడ పైడిరాజు అనే వృద్ధుడు నివసిస్తున్నాడు. తన భార్య నూకమ్మ మొదటి భర్త కుమారుడు దువ్వాడ అప్పారావు కుమారుడైన దువ్వాడ నాగరాజుకు రెండేళ్ల కిందట తన ఇంటిలో కొంత భాగాన్ని అతడు అద్దెకు ఇచ్చాడు. ఆ సమయంలో హక్కుదారుడైన దువ్వాడ పైడిరాజును అన్నీ తానై చూసుకుంటానని వృద్ధుడి కుమార్తెలను నాగరాజు నమ్మబలికి ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కేవలం మూడు నెలల అద్దె మాత్రం చెల్లించి.. ఆపై పైడిరాజును పట్టించుకోవడం మానేశాడు. తనకు వచ్చే పెన్షన్ సొమ్ము, కూతుళ్లు ఇచ్చే డబ్బులతో కాలం గడుపుతున్న పైడిరాజుపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ఇంటిని ఖాళీ చేయకుండా తిష్ట వేశాడు. ఇంటికి సంబంధించిన హక్కు పత్రాలు తన వద్దే ఉన్నాయని, నాగరాజు చేత ఇల్లు ఖాళీ చేయించి ఇవ్వాలని కోరుతూ మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో వృద్ధుడు పైడిరాజు ఆదివారం ఫిర్యాదు చేశాడు. తన ఇంటిని ఖాళీ చేయకుండా కొంతమంది అండదండలతో నాగరాజు బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు పైడిరాజు తన ఇంటి ముందు దీక్షకు దిగాడు.

'సమాజ చైతన్య దీపికలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సామాజిక అంశాలతో 'సమాజ చైతన్య దీపికలు' అనే పేరుతో పుస్తకాన్ని రాయడం అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కళావేదిక కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తురగా వెంకట నాగేశ్వరరావు రచించిన సమాజ చైతన్య దీపికలు కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అంశాలను తన కవితా సంపుటిలో రచయిత చక్కగా వివరించారన్నారు. ఇటువంటి కవితా సంపుటిలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. రచయిత డి.వి. సూర్యారావు పుస్తకాన్ని విశ్లేషించారు. ఈ సందర్భంగా రచయిత నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ మాజీ చైర్మన్ వంకాయల తాతారావు, రచయిత, కళావేదిక వ్యవస్థాపకుడు నండూరి రామకృష్ణ, లెఫ్టినెంట్ కల్నల్ ఎ.కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అధిష్టింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలోని వేదిక్‌పై స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో రద్దు

మహారాణిపేట: సోమవారం జరిగే డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే ఈ కార్యక్రమం ఈ వారం నిర్వహించడం లేదన్నారు. అందువల్ల ఫిర్యాదుదారులు ఎవరు ఫోన్ చేయవద్దని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

మంచి నడవడికతో మెలగాలి

- నగరం దాటి వెళ్తే సమాచారమివ్వండి
- రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: సమాజంలో మంచి నడవడికతో మెలగాలని రౌడీ షీటర్లకు పోలీసులు సూచించారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఎవరైనా నగరం దాటి ఇతర ప్రాంతాలకు వెళ్తే సమాచారమివ్వాలని సూచించారు. ఎవరు ఎక్కడికి వెళ్లిన ముందుకు తమకు సమాచారం అందించాలన్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, బార్‌ల వద్ద తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ హితవు పలికారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు సిబ్బంది అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల జోలికి పోవద్దు..

స్థానిక ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ రవిబాబుకు అభినందనలు



రవిబాబు దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఎంవీపీ కాలనీ: ఎమ్మెల్సీగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కుంభా రవిబాబుకు రాష్ట్ర బీసీ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు విశాఖలోని ఆయన నివాసంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, సంఘం నాయకుడు మడికి నరేష్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌమ్యుడిగా, ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం పరితపించే రవిబాబుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. ఏయూ పూర్వ ఆచార్యుడిగా, మాజీ ఎమ్మెల్యేగా, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రవిబాబు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవిబాబు భార్య శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ గీతాలు చిరస్మరణీయం



రామకృష్ణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జీఎస్ఎన్ రాజు, తదితరులు

బీచ్ రోడ్డు: రామకృష్ణ గీతాలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ 76వ జయంతి కార్యక్రమం ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని ఘంటసాల ప్రాంగణంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విజయనగరంలో పుట్టిన రామకృష్ణ.. నేదునూరి కృష్ణమూర్తి వద్ద శాస్త్రీయ సంగీత మెలకువలు నేర్చుకుని ఎన్నో కచేరీలు ఇచ్చారన్నారు. విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డా. జాలాది విజయ మాట్లాడుతూ 200 చిత్రాలకు ఐదు వేలకు పైగా పాటలు పాడిన అపర ఘంటసాల వి.రామకృష్ణ అని కొనియాడారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ఆకాశవాణి గాయకుడిగా రంగ ప్రవేశం చేసిన రామకృష్ణ అన్ని వర్గాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ డీవో బొమ్మిడి సత్యనారాయణ, వి.రామకృష్ణ మెమోరియల్స్ అధ్యక్షుడు, గాయకుడు జి.రామకృష్ణ, సకల కళాకారుల సంఘం కార్యదర్శి, లెఫ్టినెంట్ లోకేశ్వరరావు, రచయిత పి.శ్యాం సుందర్, జి.త్యాగరాజు, లాయర్ శ్రీదేవి, డీబీ వెంకటాద్రి, వెంకటలక్ష్మి, వి.సత్యం తదితరులు పాల్గొని రామకృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఏయూ సమాచారం

సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ కీలకం



ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణను సత్కరిస్తున్న ఆచార్యులు



సదస్సుకు హాజరైన విద్యార్థులు

ఏయూ క్యాంపస్: సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ ఎంతో కీలకమని ఏఐటీయూసీ(ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) జాతీయ ఉపాధ్యక్షుడు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వర్కర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డి.ఆదినారాయణ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ట్రేడ్ యూనియన్– ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. మానవ వనరుల మేనేజర్‌గా విధి నిర్వహణలో ఎదుర్కొనే వివిధ సవాళ్లు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేయడం, యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య సహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ఎంతో అవసరమన్నారు. సంస్థ అభివృద్ధికి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆదినారాయణను విభాగాధిపతి ఆచార్య జాలాది రవి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ వై.ఆర్.రెడ్డి, ఎంబీఏ, హెచ్ఆర్ఎం విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం



రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్, సిబ్బంది

మద్దిలపాలెం : ప్రపంచ దోమల దినోత్సవాన్ని ఆదివారం మద్దిలపాలెం మలేరియా సబ్ యూనిట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దోమకాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని కనుగొన్న శాస్త్రవేత్త రోనాల్డ్ రాస్ చిత్రపటానికి సబ్ యూనిట్ అధికారి నగేష్‌పట్నాయిక్, సిబ్బంది పూలమాలలు వేశారు. అనంతరం సబ్‌యూనిట్ అధికారి పట్నాయక్ మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్ రాస్ ఆడ దోమ ఎనాఫిలీస్ కాటు ద్వారా మలేరియా సోకుతుందని గుర్తించారన్నారు. అలా ఆ రోజును ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమన్నారు. ఇందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం నీటి నిల్వలను తొలగించాలన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

జీవీఎంసీ జోన్ - 2 అధికారుల ఫోన్ నంబర్లు ఇవే

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలో పలువురు అధికారులు వేర్వేరు ప్రాంతాలకు బదిలీకాగా వారి స్థానంలో మరికొందరు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. వారి వివరాలు, ఫోన్ నంబర్లు ఇలా ఉన్నాయి.

అధికారి	హోదా	ఫోన్ నంబర్
కె.కనకమహాలక్ష్మి	జోనల్ కమిషనర్	98483 66878
ఎ.అప్పలరాజు	సూపరింటెండెంట్	99482 96999
కె.వెంకటేశ్వరరావు	ఏసీపీ (టౌన్‌ప్లానింగ్)	99123 49435
వరప్రసాద్	టీపీవో (టౌన్‌ప్లానింగ్)	93902 89961
రుూన్సీ	టీసీఎస్ (టౌన్‌ప్లానింగ్)	99123 49431
డాక్టర్ కిషోర్	వైద్యాధికారి	95026 61063
మంగరాజు	బీడీఆర్ (పారిశుధ్యం)	93912 52999
శ్రీనివాసరాజు	శానిటరీ సూపర్‌వైజర్	99488 83930
పి.రమేష్	ఆర్‌వో (రెవెన్యూ విభాగం)	99853 73797
బి.రమేష్	ఆర్ఐ (రెవెన్యూ విభాగం)	98665 08143
ముగడ రాజు	ఆర్ఐ (రెవెన్యూ విభాగం)	98664 44408
ఎస్.మత్స్యరాజు	ఈఈ (ఇంజనీరింగ్ వర్క్స్)	99485 25297
ఆర్.వంశీకృష్ణ	డీఈ (ఇంజనీరింగ్ వర్క్స్)	99123 49450
శ్రీధర్	ఏఈ (ఇంజనీరింగ్ వర్క్స్)	99599 28441
అన్నంనాయుడు	ఏఈ (ఇంజనీరింగ్ వర్క్స్)	77299 95930
కె.ఎల్.సుధాకర్	ఈఈ (నీటి సరఫరా)	99515 32875
డి.శ్రీహరి	డీఈ (నీటి సరఫరా)	99485 25293
వై.అప్పాజీ	ఏఈ (నీటి సరఫరా)	99123 49432
టి.రాయల్ బాబు	విద్యుత్ ఈఈ	99480 78504
ఎన్.గంగాధర్	ఏపీడీ (యూసీడీ)	77299 95947